
సాక్షి బాపట్ల

మంగళవారం । 27 । జూన్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.80 అడుగుల వద్ద ఉంది. ఇది 148.9116 టీఎంసీలకు సమానం.



హుండీ లెక్కింపు రేపు

పెదకాకాని: భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం జరుగుతుందని దేవస్థాన సహాయ కమిషనర్ ఎస్.శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు.



దుర్గమ్మ సేవలో జస్టిస్ సుజాత

విజయవాడ: ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత సోమవారం దర్శించుకున్నారు. సారె సమర్పించారు.

న్యూస్‌రీల్

విత్తన దుకాణాల్లో తనిఖీలు



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరులోని రాజాగారితోట, పట్నంబజారు, ఏటుకూరు రోడ్ ప్రాంతాల్లోని పలు విత్తన దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి సోమవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన అనుమతి పత్రాలు చూపని కారణంగా రూ.26,25,937 విలువ గల 136.80 కిలోల మిరప, పత్తి, కూరగాయల విత్తనాల అమ్మకాలు నిలిపి వేశారు. ఏడీఏ సీహెచ్ సునీత మాట్లాడుతూ విత్తనాలను ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మినట్లయితే కేసులు నమోదు చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయించినట్లు రైతుల నుంచి ఫిర్యాదులు అందితే దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి రైతు విత్తనం కొనుగోలు చేసిన తర్వాత రశీదు తప్పనిసరిగా పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను డీలర్లు తప్పక పాటించాలని ఆదేశించారు. తనిఖీల్లో ఏడీఏ టి.శ్రీనివాసరావు, సీహెచ్ తిరుమలాదేవి, ఏఓలు బి.అంజిరెడ్డి, బి.కిషోర్, ఐ.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అయ్యవార్ల 'అతి'క్రమణపై ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో ప్రధానోపాధ్యాయులు చేస్తున్న అతిపై సోమవారం డీఈఓ శైలజ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూళ్లలో చేరేందుకు వస్తున్న విద్యార్థులతో ఇంగ్లిష్ పాఠం చదవమనటం, ఎవరైనా చదవలేకపోతే అడ్మిషన్లు నిరాకరిస్తూ కొందరు ప్రధానోపాధ్యాయులు సొంత రూల్స్ అమలు చేస్తున్న నేపథ్యంలో 'అయ్యవార్ల అతిక్రమణ' శీర్షికన సోమవారం 'సాక్షి' గుంటూరు జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి శైలజ స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు తెనాలి ఉప విద్యాశాఖాధికారి నిర్మల, మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ విచారణ జరిపారు. సొంత నిబంధనలు అమలుచేస్తున్న ప్రధానోపాధ్యాయుడిని గుర్తించి, లిఖితపూర్వక సంజాయిషీ అడిగారు. నిబంధనల ప్రకారం అడ్మిషన్ కోరి వచ్చిన విద్యార్థులను చేర్చుకోవాలని స్పష్టంచేశారు. ఇలాంటివి పునరావృతం కారాదని హెచ్చరించారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు హుండీల ద్వారా రూ.3.54 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించారు. ఆది దంపతులకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు, మొక్కుబడులు, ముడుపులను సోమవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 20 రోజులకు రూ.3,54,87,284 నగదు, 666 గ్రాముల బంగారం, 7.752 కిలోల వెండి సమకూరిందని ఆలయ ఈఓ భ్రమరాంబ తెలిపారు. రోజుకు సరాసరిన రూ.17.74 లక్షల ఆదాయం హుండీల ద్వారా వచ్చిందని పేర్కొన్నారు. కానుకల లెక్కింపును పాలక మండలి సభ్యులు చింకా శ్రీనివాసులు, బచ్చు మాధవీకృష్ణ, దేవదాయ శాఖ అధికారులు అనురాధ, పోలీసులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షించారు. ఇక ఈ హుండీ ద్వారా రూ.36,153 విరాళాలను భక్తులు సమర్పించారు.

38,882 మిర్చి బస్తాల రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 38,882 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 36,599 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.9,500 నుంచి 23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 13,500 నుంచి రూ. 25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. యార్డులో ఇంకా 14,641 బస్తాలు మిర్చి నిల్వ ఉంది.

ప్రతి ఘటనకూ పచ్చరంగు

- ఐలవరంలో కుటుంబ కలహాలు
- మేనకోడలిని తీసుకెళ్లి పెళ్లిచేసుకున్నాడనే అక్కసుతో దాడి
- వ్యక్తిగత కక్షలతో జరిగిన విద్యార్థి హత్యలోనూ శవరాజకీయమే
- ప్రతిదానికీ రాజకీయ రంగు
- టీడీపీ నేతల రాద్ధాంతం
- అధికారపార్టీపై బురదజల్లడమే లక్ష్యం
- జనం ఛీ కొడుతున్నా మారని తీరు



సొంత పార్టీనేతల చేతిలో హత్యకు గురైన టీడీపీ నేత రామకృష్ణ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి (ఫైల్)

సాక్షిప్రతినిధి,బాపట్ల: ఘటన ఏదైనా... నేరం ఏవిధంగా జరిగినా... అధికారపార్టీ పై బురదజల్లడమే లక్ష్యంగా ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యక్తిగత గొడవలు, కుటుంబ కలహాలను సైతం పచ్చపార్టీ నేతలు రాజకీయాలకు ముడిపెడుతున్నారు. ఓట్ల రాజకీయానికి తెరలేపుతున్నారు. చివరకు పరిపక్వతలేక క్షణికావేశానికి లోనైన యువకులు, విద్యార్థులు గొడవపడినా దీనివెనుక అధికార పార్టీ హస్తముందటూ పచ్చపార్టీతో మరికొన్ని పార్టీలు, ఎల్లోమీడియా దిగజారి ప్రచారం చేస్తున్నాయి. వాస్తవాలు కప్పిపెట్టి నిందలు మోపడమే పనిగా ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారు. చిన్నఘటనలనూ పెద్దవి చేసేందుకు సామాజికవర్గాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. రాజకీయ లబ్ధే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు దిగజారి వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జిల్లాలో దురదృష్టవశాత్తూ జరిగిన ఒకటి రెండు ఘటనలను అవకాశంగా తీసుకొని ప్రతిపక్ష టీడీపీ కొన్ని వర్గాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే రీతిలో వ్యవహరిస్తోంది.

కుటుంబ కలహాలతో నాగేంద్రపై దాడి...

కుటుంబకలహాల నేపథ్యంలోనే ఆదివారం భట్టిప్రోలు మండలం ఐలవరంలో శ్రీరామనాగేంద్రపై దాడి జరిగింది. నాగేంద్ర, అదే గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ పప్పుల వెంకటేశ్వర్లు కుటుంబాల మధ్య ఏడాదిగా గొడవలు ఉన్నాయి. వెంకటేశ్వర్లు మేనకోడలును నాగేంద్ర ప్రేమించాడు. ఏడాది క్రితం ఆమెను తీసుకెళ్లి కుటుంబసభ్యులకు ఇష్టం లేకుండా పెళ్లి చేసుకున్నాడు. అప్పటినుంచి రెండు కుటుంబాల మధ్య కలహాలు మొదలయ్యాయి. ఆదివారం కోడిపందేలవద్ద కనిపించిన నాగేంద్రపై వెంకటేశ్వర్లు దాడిచేశాడు. ఈ దాడిలో నాగేంద్ర తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

ఘటనపై టీడీపీ రాద్ధాంతం...

నాగేంద్రంపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్కా ఆనందబాబు హుటాహుటిన జీజీహెచ్‌కి చేరుకొని ప్రతిపక్ష నాయకుడిపై అధికారపార్టీ నాయకుల దాడి అంటూ విమర్శలకు దిగారు. దళితులపై ప్రభుత్వమే దాడి చేస్తోందంటూ ఆరోపణలు చేశారు. ఆవేశపడిపోయారు. బాధితుడు, దాడికి పాల్పడిన వ్యక్తి ఇద్దరూ దళితులే అన్న విషయం కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. కేవలం కుటుంబ కలహాలతోనే ఈ దాడి జరిగిందన్నది అందరికీ తెలిసిన విషయమే. అయినా రాజకీయ లబ్ధి కోసం దాడిని అధికారపార్టీపైకి నెట్టడం ప్రతిపక్షపార్టీ దిగజారుడు తనానికి నిదర్శనంగా మారింది.

విద్యార్థి హత్యలోనూ రాజకీయమే..

ఇటీవల చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిపాలెంలో పదో తరగతి విద్యార్థి అమరనాథ్‌ను వెంకటేశ్వరరెడ్డితోపాటు మరికొందరు పెట్రోల్ పోసి నిప్పటించడంతో విద్యార్థి మృతిచెందాడు. తన సోదరితో సన్నిహితంగా మెలుగుతున్నారనే కారణంతో మిగిలిన యువకులను అమరనాథ్ వారించాడు. దాన్ని మనసులో పెట్టుకొని వారు విద్యార్థిని హత్య చేయడం సహించరాని నేరం. ప్రతిఒక్కరూ ఈ పాశవిక చర్యను ఖండించారు. నేరస్తులకు కఠిన శిక్ష పడాలని కోరారు. ఈ ఘటనపై రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు తక్షణమే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయంతోపాటు నివేశన స్థలాన్ని అందజేసింది. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇవేమి పట్టించుకోకుండా చంద్రబాబు అండ్ కో ఓట్ల రాజకీయానికి తెరలేపారు. ఈ ఘటనను కూడా ప్రభుత్వంపై నెట్టేందుకు నానా తంటాలు పడ్డారు. మరింత దిగజారి జనాన్ని సేకరించి సభలు పెట్టి మరీ బురదజల్లే ప్రయత్నం చేశారు. రేపల్లె ఎమ్మెల్యే ఇదే అవకాశంగా ఓట్ల కోసమే అన్నట్లు పనిగొట్టుకొని ఆరోపణలు చేయటంపై విమర్శలు వెల్లువెత్తాయి.

పచ్చనేతలు హత్యలు చేస్తే కనిపించవా..?

రెండు నెలల కిందట రేపల్లె నడిబొడ్డున టీడీపీ నాయకుడు, 14వ వార్డు కౌన్సిలర్ అన్నే రామకృష్ణను సొంత పార్టీ నేతలే దారుణంగా హత్యచేశారు. ఆధిపత్య పోరులో భాగంగానే ఈ హత్య జరిగింది. ఈ ఘటనపై చంద్రబాబు అండ్ కో నోరు మెదపలేదు. టీడీపీ స్థానిక నేతలు, సహచర కౌన్సిలర్లు సైతం ఏ ఒక్కరు స్పందించలేదు. తన భర్తను పాశవికంగా నరికారంటూ భార్య కన్నీటిపర్యంతమైనా పచ్చనేతలు కనికరం చూపలేకపోయారు. ప్రతిపక్ష పార్టీ నేతలు హత్యలు చేసినా వారి కంటికి అవి సహజమరణాలుగా కనిపిస్తాయి. వ్యక్తిగత కక్షలు, కుటుంబకలహాలతో ఎవరైనా దాడులకు పాల్పడినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే చేయించిందంటూ గల్లీ నుంచి రాష్ట్ర నేతల వరకు శవ రాజకీయాలకు తెరలేపడంపై ఇదేం ఖర్మ అంటూ జనం ఛీ కొడుతున్నారు.

అమ్మఒడి శుభ'మనీ'

రేపు నాలుగో విడత ఆర్థిక లబ్ధి

- గుంటూరు జిల్లాలో ఎంపికైన 1,59,594 మంది మాతృమూర్తులు
- రూ.239.39 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూర్చనున్న ప్రభుత్వం
- గ్రామ, వార్డు సచివాలయాల వారీగా జాబితాల ప్రదర్శన
- తల్లులచే బయోమెట్రిక్ అథంటిఫికేషన్ నమోదు చేయిస్తున్న వలంటీర్లు
- రేపు జిల్లాస్థాయిలో కార్యక్రమం
- ఈనెల 30 నుంచి మండలాల వారీగా జగనన్న అమ్మఒడి కార్యక్రమాలు



గుంటూరు జిల్లాలో నాలుగేళ్లలో అమ్మఒడి ఆర్థిక లబ్ధి ఇలా(రూ.కోట్లలో)

విద్యాసంవత్సరం	తల్లుల సంఖ్య	ఆర్థిక లబ్ధి
2019–20	1,46,232	219.34
2020–21	1,55,330	232.99
2021–22	1,64,601	246.90
2022–23	1,59,594	239.39

గుంటూరు ఎడ్యుకేషన్: పిల్లలను పాఠశాలలకు పంపుతున్న తల్లులకు జగనన్న అమ్మఒడి నాలుగో విడత ఆర్థిక లబ్ధిని ప్రభుత్వం ఈనెల 28న బుధవారం అందించనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో తుది దశకు చేరాయి. గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థుల్లో అర్హులను గుర్తించి, ఎంపిక చేసిన ప్రభుత్వం వారి మాతృమూర్తుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనుంది. ఇప్పటికే అమ్మఒడి అర్హుల జాబితాలను ప్రభుత్వ ఆదేశాలతో గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులు ప్రదర్శిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం 1,59,594 మంది మాతృమూర్తులకు రూ.15వేల చొప్పున రూ.239.39 కోట్ల ఆర్థిక ప్రోత్సాహాన్ని సర్కారు అందించనుంది. లబ్ధిదారుల జాబితాలను ఈనెల 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జగనన్న అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. అలాగే గుంటూరు జిల్లాకు సంబంధించిన అధికారిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా ఈనెల 30 నుంచి మండలాల వారీగా పాఠశాలల్లో జగనన్న అమ్మఒడి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

అమ్మఒడి ఆర్థిక ప్రయోజనాన్ని అందుకునేందుకు ఉద్దేశించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా నిర్వహించింది. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా వలంటీర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వం అందించే లబ్ధికి దూరం కాకూడదనే సదుద్దేశంతో ఎంతో పారదర్శంగా నిర్వహించారు. వలంటీర్లు తమ పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, మాతృమూర్తులతో బయోమెట్రిక్ అథంటిఫికేషన్ నమోదు చేస్తున్నారు. సోమవారం రాత్రికి ఈ ప్రక్రియ పూర్తికానుంది.

నిమ్మకాయల ధర



తెనాలిటౌన్(గుంటూరు జిల్లా): తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.800, గరిష్ఠ ధర రూ.1,700, మోడల్ ధర రూ.1,200 వరకు పలికింది.



ఆపరేషన్ విజయవంతం కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్న డాక్టర్ గోఖలే బృందం

సర్కారు సహృదయం

- సహృదయ ట్రస్టు ద్వారా జీజీహెచ్‌లో బైపాస్ సర్జరీలు
- నాటి ప్రభుత్వ నిర్దయతో ఆగిన శస్త్రచికిత్సలు
- సంక్షేమ పాలకుని కృషితో ప్రారంభం
- గుంటూరు జీజీహెచ్‌లో డాక్టర్ గోఖలే సేవలు అందుబాటులోకి..



బైపాస్ సర్జరీ చేస్తున్న డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే బృందం

గుంటూరు మెడికల్: సంక్షేమ సర్కారు పేదల గుండెధైర్యమై నిలిచింది. గత ప్రభుత్వ నిర్దయతో ఆగిన గుండె శస్త్రచికిత్సలను మళ్లీ పునఃప్రారంభించింది. 600పైగా సర్జరీలు, నాలుగు గుండె మార్పిడి శస్త్రచికిత్సలతో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన అపర సంజీవని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే చొరవతో మళ్లీ రోగుల గుండెల్లో సంతోషాలు పూయించి తన కీర్తిపతాకను సగర్వంగా రెపరెపలాడించేందుకు సిద్ధమైంది.

టీడీపీ ప్రభుత్వంలో కునారిల్లి..

గుంటూరు జీజీహెచ్ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వసతుల్లేక కునారిల్లింది. ఆస్పత్రిలో పసికందును ఎలుక కొరికిన ఘటన మాయని మచ్చగా, అప్పటి ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనంగా నిలిచింది. ఆస్పత్రిపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లేలా చేసింది. ఈ క్రమంలో 2019లో అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేశారు. వైద్య సిబ్బంది నియామకం, నూతన వైద్య పరికరాల కొనుగోలు ద్వారా జీజీహెచ్‌కు ఊపిరిపోశారు. దీంతో రోజుకు నాలుగువేలకుపైగా ఓపీతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్యశాలగా గుర్తింపు పొందింది.

విన్నవించినా పట్టించుకోని గత ప్రభుత్వం

ఎలుక కొరికి పసికందు మృత్యువాత పడిన ఘటనతో అప్రతిష్టపాలైన గత ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు సహృదయ ట్రస్టును పావుగా వినియోగించుకుంది. 2015లో సహృదయ ట్రస్టు ద్వారా జీజీహెచ్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించేందుకు గుండె మార్పిడి సర్జన్ డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే ముందుకు రావడంతో మూడేళ్లపాటు 2018 వరకు సేవలు అందించేందుకు ఉత్తర్వులిచ్చింది. దీనివల్ల అప్పటివరకు ఉన్న అపఖ్యాతిని పోగొట్టుకోవాలని కుయుక్తి పన్నింది. సేవలు ఆరంభించిన డాక్టర్ గోఖలే సుమారు 600కుపైగా బైపాస్ సర్జరీలు, నాలుగు గుండె మార్పిడి సర్జరీలు నిర్వహించారు. సహృదయ ట్రస్టుతో కుదుర్చుకున్న ఒప్పందం ముగిసినా డాక్టర్ గోఖలే అదనంగా 11 నెలల పాటు ఉచితంగా సేవలందించారు. తమ ట్రస్టు సేవలను పొడిగించాలని గత టీడీపీ ప్రభుత్వానికి విన్నవించారు. అయినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. దీంతో గోఖలే జీజీహెచ్ వదిలి వెళ్లిపోయారు. అప్పటి నుంచి గుండె ఆపరేషన్లు నిలిచిపోయాయి. మళ్లీ ఇప్పుడు సంక్షేమ సర్కారు చొరవతో ఆపరేషన్లు ప్రారంభమయ్యాయి. సోమవారం డాక్టర్ గోఖలే ఆధ్వర్యంలో వైద్యులు గుంటూరుకు చెందిన రోగి కిషోర్‌కు తొలి బైపాస్ సర్జరీ దిగ్విజయంగా పూర్తిచేశారు.

రెగ్యులర్‌గా బైపాస్ సర్జరీలు

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతివారం రెగ్యులర్‌గా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గుండె బైపాస్ సర్జరీలు చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు జీజీహెచ్, రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులకు శిక్షణ ఇవ్వడంతోపాటు, సర్జరీలు చేసేందుకు తమకు ప్రత్యేక అనుమతులు ఇచ్చింది. సర్జరీలు రెగ్యులర్‌గా జరిగేలా జీజీహెచ్ వైద్యులకు శిక్షణ ఇస్తాను. గతంలో గుండె మార్పిడి ఆపరేషన్లు చేయించుకున్న ఏడుకొండలు, హరిబాబుకు ప్రతినెలా రూ.3 లక్షల ఖరీదు చేసే మందులు సహృదయ ట్రస్టు ద్వారా ఉచితంగా అందిస్తున్నాం. పేదలు సేవలను వినియోగించుకోవాలి.

– డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

- జగనన్న కాలనీలపై అధికారులతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సమీక్ష
- నత్తనడక పనులపై ఆగ్రహం
- అమర్తలూరు, భట్టిప్రోలు ఏఈలపై చర్యలకు ఆదేశం

బాపట్ల: జగనన్న లేఅవుట్లలో భూమి చదును చేసే పనులు సత్వరమే పూర్తిచేయకపోతే అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా హెచ్చరించారు. జగనన్న లేఅవుట్లు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. జగనన్న లేఅవుట్లలో పనులను రెండున్నరేళ్లుగా ఎందుకు పూర్తిచేయలేదని అధికారులను కలెక్టరు నిలదీశారు. అమర్తలూరులో 30 పనులు పెండింగ్‌లో ఉండగా.. భట్టిప్రోలు మండలంలో 42 పనులు పురోగతి లేకపోవడంపై కలెక్టరు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ రెండు మండలాల ఏఈలను సస్పెండ్ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆదేశించారు. చుండూరు మండలంలో 35 పనులు మంజూరు కాగా 34 పనులు పెండింగ్‌లో ఉండడంపై ఏఈకి షోకాజ్ నోటీసు జారీ చేయాలన్నారు. అన్ని మండలాలలో పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. గడిచిన 9 నెలల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అధికారులలో చిత్తశుద్ధి లోపించిందన్నారు. ఇంజినీర్ల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సూచించారు. అప్పటికి పనులు ప్రారంభించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పీఆర్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపించడమే కారణమన్నారు. పనులు చేయకుండా, విధులు నిర్వహించకుండా ప్రభుత్వం నుంచి వేతనాలు ఎలా తీసుకుంటున్నారంటూ మండిపడ్డారు బాధ్యతలను విస్మరించడం మంచి పద్ధతి కాదన్నారు. చిన్నగంజాం మండలంలో 19 పనులు మంజూరు కాగా 11 పనులు మొదలు కాకపోవడం, 13 కల్వర్టు పనులు ప్రారంభం కాకపోవడంపై ఆరా తీశారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యం..

జగనన్న కాలనీలకు తాగునీటి సరఫరా పనులు పూర్తిచేయకపోవడంపై కలెక్టరు రంజిత్ బాషా అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలోని 283 జగనన్న లేఅవుట్లలోకి 235 పనులు మంజూరు కాగా కేవలం 13 పనులు పురోగతి సాధించడం ఏమిటని నిలదీశారు. 214 పనులు ఎందుకు ప్రారంభించలేదని అధికారులపై మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటున్నందుకైనా ఇంజినీర్లు బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు సెప్టెంబరు 15వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సమగ్ర ప్రణాళికతో ఇంజినీరింగ్ అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఇప్పటికే రూ.33 కోట్ల బిల్లులు విడుదలయ్యాయన్నారు. ప్రభుత్వ భవనాలకు నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. వేమూరు నియోజకవర్గంలో నిర్మాణ పనుల్లో జాప్యం ఉండరాదన్నారు. అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, గృహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

ప్రోత్సహించే'లా'..



కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కోన రఘుపతి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: రాష్ట్రంలో జూనియర్ న్యాయవాదులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో సోమవారం ప్రారంభించిన వైఎస్సార్ లా నేస్తం కార్యక్రమానికి జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఎమ్మెల్యే కోన రఘుపతి హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం అనంతరం ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు. రాష్ట్రంలో అర్హులైన జూనియర్ న్యాయవాదులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో జూనియర్ న్యాయవాదులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా నిలదొక్కుకోవడానికి నెలకు రూ.5వేలు వంతున ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకాన్ని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి రాజ్‌దిబోరా, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అర్జీలపై సత్వర 'స్పందన' అవసరం

- జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్
- స్పందనకు 136 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్

బాపట్ల: స్పందన అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. స్పందన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్లోని డీఆర్‌సీ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అర్జీల ద్వారా తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. కొన్నింటికి జిల్లా జాయింట్ కలెక్టర్ తక్షణమే పరిష్కార మార్గం చూపారు. మరికొన్నింటిని పరిశీలన, విచారణకు ఆదేశించారు. ఎస్పందనలో మొత్తం 136అర్జీలు వచ్చాయి. జగనన్నకు చెబుదాం పోర్టల్ లో వచ్చే అర్జీలకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జేసీ తెలిపారు. జె.కె.సిలో 21 అర్జీలు రాగా పెండింగ్‌లో మరికొన్ని ఉన్నాయన్నారు. దేవదాయ శాఖలో 14 అర్జీలు, సర్వే ల్యాండ్స్ రికార్డు శాఖలో 12, వివిధ శాఖల్లో పదుల సంఖ్యలో అర్జీలు పెండింగ్ లో ఉండడంపై అధికారులను ప్రశ్నించారు. గడువులోగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. స్పందన పోర్టల్‌లో 41 అర్జీలు పునరావృతం కావడంపై ఆరా తీశారు. ఆర్‌అండ్‌బీ లో–4, విద్యుత్ శాఖలో–3, వ్యవసాయ శాఖలో–3, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్‌లో–2, ఆర్‌డబ్ల్యూఎస్‌లో–2, వివిధ శాఖల్లో మరికొన్ని పునరావృతం అయ్యాయన్నారు. వాటిపై దృష్టిసారించి నాణ్యతతో పరిష్కరించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నందున విత్తనాల నాణ్యతా ప్రమాణాలను అధికారులు పరిశీలించాలని జేసీ శ్రీధర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలకు ప్రత్యేక బృందాలను నియమించాలన్నారు. పౌర సరఫరాల శాఖలోని డీటీలు, ఏఓలతో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటుచేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాలలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండేలా చూడాలన్నారు. సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. 3 పేజీల ప్రశ్నావళిని ప్రతి ఇంటి వద్ద వలంటీర్లు చదివి ప్రజలకు వినిపించాలన్నారు. ప్రజల అవసరాలను వలంటీర్లకు ఇచ్చిన ఫోన్ లోని యాప్ లో నమోదు చేయాలన్నారు. తదుపరి ఆ వివరాలను సచివాలయాల నుంచి ఏపీ సేవా పోర్టల్‌లో డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా నమోదు చేయాలన్నారు. ప్రజల గృహాల సందర్శన, వారి అవసరాల నమోదు ప్రక్రియ కనీసం 25శాతం ఉండేలా పనిచేయాల్సి ఉందన్నారు. నవరత్నాలు అర్హులైన ప్రజలందరికీ పారదర్శకంగా అదించడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇందుకోసం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందించాలన్నారు. డీఆర్‌ఓ కె.లక్ష్మీ శివజ్యోతి, బాపట్ల ఆర్డీఓ రవీందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై రెండు పూరిళ్లు దగ్ధం

రూ.4లక్షల ఆస్తి నష్టం



పేరలి(కర్లపాలెం): వంట గ్యాస్ లీకై మంటలు ఎగసి రెండు పూరిళ్లు దగ్ధమైన సంఘటన పేరలి పంచాయతీ మేకలవారిపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. వీఆర్‌ఓ శివారెడ్డి తెలిపిన వివరాల మేరకు మేకలవారిపాలెం గ్రామానికి చెందిన ఏపూరి జయరావు భార్య చెకోమి సోమవారం మధ్యాహ్నం తన గృహంలో టీ వేడి చేసుకునేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించగా ప్రమాదవశాత్తూ సిలిండర్ నుంచి ఒక్కసారిగా గ్యాస్ బయటకు వచ్చి మంటలు ఎగసి పూరింటికి మంటలు అంటుకున్నాయి. ఈఘటనలో పక్కనే ఉన్న జయరావు తండ్రి ఇజ్రాయేలు గృహానికి కూడా మంటలు అంటుకుని రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాపట్ల నుంచి ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేటప్పటికే రెండిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయని వీఆర్‌ఓ తెలిపారు. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం సుమారుగా రూ.4లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు.

మత్తును చిత్తు చేస్తేనే భవిష్యత్తు

మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: డ్రగ్స్ రహిత సమాజం యువత వల్లే సాధ్యమని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని సూర్యశాళి ఫంక్షన్ ప్లాజాలో యువత, విద్యార్థులతో ఎస్పీ వకుల్‌జిందాల్ అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పట్టణంలో డ్రగ్స్‌కు బానిసలు కావడం వలనే కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ గడిచిన 6 నెలల్లో జిల్లాలో 29 గంజాయి కేసులు నమోదయ్యాయన్నారు. 29 కేసుల్లో 126 మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుచి 604 కేజీల గంజాయిను సీజ్ చేశామన్నారు. తరచూ గంజాయి రవాణాకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులపై పీడీ కేసులు అమలు చేశామన్నారు. మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలు గురించి జిల్లాలో ఇప్పటికే 27 కళాశాలల్లో 'సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. తొలుత డ్రగ్స్ తీసుకుంటే కలిగే దుష్పరిణామాలు, జీవితం మీద కలిగే ప్రభావాలు తెలియపరుస్తూ పలు వీడియోలు, పీపీటీల ద్వారా విద్యార్థులకు అవగాహనా కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ సేవించడం వలన కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. మాదకద్రవ్యాలకు ఆకర్షితులవుతున్న వారిలో ఎక్కువ శాతం మంది యువత, విద్యార్థులే ఉన్నారన్నారు. మాదకద్రవ్యాలను విక్రయించే వారు కూడా వీరిని లక్ష్యంగా చేసుకుని వారి స్వార్థపరమైన కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉంటారన్నారు. కాబట్టి యువత జాగురూకత కలిగి ఉండాలన్నారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలను, ఆకాంక్షలను నెరవేరుస్తూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అడిషనల్ ఎస్పీ పి.మహేష్, బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఈబీ ఏఈఎస్ నరసింహారావు, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్ బాబు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, పోలీస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడిపై దాడి

- గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు
- పోలీసుల అదుపులో నిందితుడు



గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు శ్రీరామ నాగేంద్రబాబు



వివరాలను వెల్లడిస్తున్న వేమూరు సీఐ టి.వెంకటేశ్వరరావు

భట్టిప్రోలు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడుపై గడ్డపలుగుతో దాడి చేసిన ఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాలు, సేకరించిన సమాచారం మేరకు భట్టిప్రోలు మండలం ఐలవరంకు చెందిన పప్పుల వెంకటేశ్వర్లు మేనకోడలు అదే గ్రామానికి చెందిన శ్రీరామ నాగేంద్రబాబు కొన్నాళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇరువురు ఊరు వదిలి వెళ్లిపోయారు. వెళ్లిపోయిన మేనకోడలను వెంకటేశ్వర్లు తీసుకురాగా మళ్లీ ఏడాది క్రితం నాగేంద్ర బాబుతో వెళ్లిపోయి వివాహం చేసుకుంది. దీంతో ఇరు కుటుంబాల మధ్య కలహాలు చోటు చేసుకున్నాయి. ఇది మనసులో పెట్టుకున్న వెంకటేశ్వర్లు సమయం కోసం ఎదురు చూశాడు. ఆదివారం సాయంత్రం స్థానిక దళిత వాడలో వేసిన కోడి పందేల వద్ద నాగేంద్ర బాబు ఒంటరిగా దొరకడంతో తలపై గడ్డ పలుగుతో వెంకటేశ్వర్లు దాడి చేశాడు. తీవ్ర గాయాల పాలైన నాగేంద్ర బాబు ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతనికి ప్రాణాపాయం తప్పిందని పోలీసులు తెలిపారు. సోమవారం బాధితుడి స్టేట్‌మెంట్ ఆధారంగా వేమూరు సీఐ టి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు. నిందితుడు వెంకటేశ్వర్లు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని... అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ దాడి జరగగా టీడీపీ నాయకులు రాజకీయ రంగు పులిమి రాద్ధాంతం చేయడం విచారకరం.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు..

కుటుంబ కలహాల నేపథ్యంలో భట్టిప్రోలు మండలం ఐలవరంకు చెందిన శ్రీరామ నాగేంద్రబాబుపై గడ్డ పలుగుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన పప్పుల వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నట్లు వేమూరు సీఐ టి.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది కేవలం కుటుంబ కలహాల వల్లే జరిగిందని, రాజకీయాలకు, పార్టీలకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. తన మేనకోడలును ప్రేమించి పెళ్లి చేసుకుని తమ ముందే కాలర్ ఎగరవేసుకుని తిరుగుతున్నాడనే కక్షతోనే నాగేంద్రబాబుపై వెంకటేశ్వర్లు సోమవారం దాడి చేశాడని తెలిపారు. నిందితుడి పై 307 కేసు నమోదు చేసి మంగళవారం రేపల్లె కోర్టులో హాజరుపరచనున్నట్లు వివరించారు. నిందితుడిని 24 గంటలలోపు పోలీసులు అదుపులోకి తీసుకోవడం గమనార్హం.

కడలి ఒడిలోనే తుది శ్వాస

సముద్రంలో వేటకు వెళ్లి గుండెపోటుతో మత్స్యకారుడు మృతి



మృతిచెందిన ఏడుకొండలు

వేటపాలెం: సముద్రంలో వేట కెళ్లి మత్స్యకారుడు అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కఠారివారిపాలేనికి చెందిన ఐదుగురు మత్స్యకారులు బోట్లల్లో సముద్రంలోకి వేటకు వెళ్లారు. అయితే చేపల వేట సమయంలో కొండూరి చిన్న ఏడుకొండలు (55) అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి బోటులోనే కుప్పకూలిపోయాడు. తోటి మత్స్యకారులు గమనించి తీరానికి తీసుకొచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలుసుకున్నారు. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

సైకిల్‌పై 15 రాష్ట్రాలు చుట్టేశాడు!



విజయగోపాలకృష్ణ

తెనాలిరూరల్: దేశంలో శాంతి నెల కొనాలని, ఘర్షణలు లేకుండా ఉండాలని ప్రార్థిస్తూ ఆయన సైకిల్‌పై రాష్ట్రాలు చుట్టేస్తున్నారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరుకు చెందిన విజయ్ గోపాలకృష్ణ దేశంలో శాంతి నెలకొనాలని కోరుతూ చేపట్టాలని నిర్ణయించుకున్నారు. గతేడాది మార్చిలో సింధనూరులో సైకిల్ యాత్ర ప్రారంభించారు. అక్కడి నుండి బయలుదేరి కేరళ, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హరియాణా, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ, పంజాబ్, ఒడిశా రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం చుట్టేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో యాత్ర కొనసాగిస్తున్నారు. బోస్‌రోడ్డులోని సాయిబాబా ఆలయానికి వచ్చిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 470 రోజులుగా యాత్ర కొనసాగుతోందని, ఇప్పటి వరకు 15 రాష్ట్రాల్లో పర్యటించి అనేక దర్శనీయ ప్రాంతాలు సందర్శించినట్టు తెలిపారు. తమ పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని తణుకు మండలం కొమరవరని తెలిపారు.

నిర్దిష్ట గడువులోపు సమస్యలకు పరిష్కారం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: బాధితుల సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 55 మంది బాధితులు తమ సమస్యను ఎస్పీకు వివరించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్న ఎస్పీ వకుల్‌జిందాల్ ఆయా పోలీస్‌స్టేషన్ల సీఐలతో నేరుగా మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోపు సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామన్నారు. అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

వార్డు సచివాలయ సిబ్బంది బదిలీలు



ఉద్యోగికి బదిలీ ఉత్తర్వులు అందిస్తున్న ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మున్సిపాలిటీల్లో వార్డు సచివాలయ సిబ్బంది బదిలీల ప్రక్రియను ప్రారంభించారు. ఈ మేరకు సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు బదిలీ అయిన ఉద్యోగులకు ఉత్తర్వులు అందజేశారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ జీఎస్‌డబ్ల్యూఎస్ ఆదేశాల మేరకు వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియను ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలో చేపట్టామన్నారు. ముందుగా ఆన్‌లైన్‌లో బదిలీల కోసం చేసుకున్న అభ్యర్థనల మేరకు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

అండర్-7 చెస్ విజేతలు మౌళి, హర్ష



జిల్లా అధ్యక్షుడు రవీంద్రరాజుతో చెస్‌లో విజయం సాధించిన చిన్నారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గుజ్జనగుండ్లలోని గ్రీన్‌ల్యాండ్ స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-7 ఓపెన్ బాల బాలికల చెస్ పోటీల్లో బాలురల్లో ఎం.శశాంక్ మౌళా, కె.హర్ష, బాలికల్లో ఎఎస్ఎస్ఎస్ కావ్య, జి.హర్షిణిలు ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలుపొందారని పోటీల నిర్వాహకురాలు షేక్ పర్వీన్ తెలిపారు. ఎంపికైన నలుగురిని ఈ నెల 28 నుంచి 30 వరకు విజయనగరంలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు. అనంతరం విజేతలకు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు సి.హెచ్ రవీంద్రరాజు, స్కూల్ ప్రిన్సిపల్ వైఎస్ రాజు అందజేసారు.

పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

ఏఎన్‌యూ: యూనివర్సిటీలో విద్య, పరిశోధనాంశాలతోపాటు విద్యార్థులకు నిరంతరం సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నామన్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఏఎన్‌యూలో సోమవారం జరిగిన యూనివర్సిటీ 87వ అకడమిక్ సెనెట్ సమావేశంలో వీసీ యూనివర్సిటీ సమగ్రాభివృద్ధి నివేదికను సమర్పించారు. రానున్న రోజుల్లో చేపట్టనున్న అంశాలను ప్రతిపాదించారు. పలు అంశాలకు అకడమిక్ సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఆగస్టు చివరి వారంలో యూనివర్సిటీ 39, 40వ స్నాతకోత్సవాలు కలిపి నిర్వహించే అంశానికి అకడమిక్ సెనెట్ ఆమోదం తెలిపింది. సెప్టెంబర్ 11న విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవం జరపాలని నిర్ణయించారు. త్వరలో జరగబోతున్న నాక్ బృందం సందర్శనను సమిష్టిగా విజయవంతం చేసి యూనివర్సిటీకి అత్యుత్తమ గ్రేడ్ తెచ్చేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. రెక్టార్ ఆచార్య డా. పి. వర ప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఏఎన్‌యూ మాజీ వీసీలు ఆచార్య బి బాలమోహన్ దాస్, ఆచార్య కె.వియన్నారావు పాల్గొన్నారు.

నూరుశాతం సమస్యల పరిష్కారమే లక్ష్యం

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- 'జగనన్న సురక్ష'పై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె: ప్రజాసంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పసిద్ధికై ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై మోపిదేవి తన కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల వద్దకే సేవలు అందించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యలతో కూడిన అర్జీలను స్వీకరించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పథకాలకై అర్హులైనవారు.. నేటి వరకు ఎటువంటి లబ్ధి అందకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశ్యంతో సమస్యను పరిష్కరించి, సంక్షేమ పథకాలకు అర్హులను చేయటం, ఇతర సమస్యలను పరిష్కరించటమే కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ ప్రభుత్వం జగనన్న సురక్ష ప్రారంభించిందని, నెల రోజులపాటు ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించి, వీటి ద్వారా జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఎటువంటి సర్వీస్ చార్జి లేకుండా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులతో కూడిన టీం ప్రతి ఇంటిని సందర్శిస్తుందని, అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి అందని వారుంటే వారిని గుర్తించి సమస్య పరిష్కారానికి కావల్సిన పత్రాలు సేకరించాలని చెప్పారు. అధికారులు, టీం సభ్యులు ప్రణాళికాబద్ధంగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి నూరుశాతం సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ విజయసారథి, తహసీల్దార్ డి.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



ఆంధ్ర కబడ్డీ సంఘం అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు

బాపట్ల అర్బన్: బాపట్ల సూర్యలంక రోడ్డులోని లోటస్ పాండ్‌లో రాష్ట్ర కబడ్డీ సంఘం అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ తాతా బసవ శంకర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా కె.ఈ.జగదీష్, వైస్ ప్రెసిడెంట్స్‌గా ఎస్.గోవర్ధన్ రెడ్డి, రామిరెడ్డి విజయభాన్ రెడ్డి, ఎస్.రామచంద్రుడు, చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా కె.సి.మాధవ మూర్తి, కార్యదర్శిగా పి.పద్మజాబాల, కోశాధికారిగా మంజుల వెంకటేష్, జాయింట్ సెక్రెటరీలుగా ఆర్.రామ్ తేజ్ గౌడ్, జనార్దన్ రావు, ఎస్.యానరాజు, డి. నాగాంజనేయరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా అనగాని సురేష్ కార్యనిర్వాహక సభ్యులుగా ఆర్. గౌడ్, వై. దూర చంద్రరావు, ఆర్.నాగేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, పి.దుర్గ అజయ్ కుమార్, ఎం.గంగాధర్, జె.విజయ్ ఆనందం, ఆర్.సుధాకర్‌లు ఎన్నికయ్యారు.

తగిన డాక్యుమెంట్లు సమర్పించాలి

ఏపీసీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ కట్టా సింహాచలం

తాడికొండ: పట్టా భూమి, అసైన్డ్ భూములకు సంబంధించి అర్హత ఉండి కౌలు చెల్లింపులు జరగని రైతులకు కౌలు చెల్లింపులు చేసేందుకు తగిన డాక్యుమెంట్లు సంబంధిత గ్రామాల కాంపిటెంట్ అథారిటీలో అందజేయాలని ఏపీ సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ కట్టా సింహాచలం సూచించారు. సోమవారం తుళ్లూరు ఏపీ సీఆర్డీయే కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ ఓఎంపీ చిరంజీవితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టా భూములకు సంబంధించి కోర్టు కేసులు లేకుండా అర్హత ఉన్న రైతులు, అసైన్డ్ భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు లేకుండా క్లియర్ కేసులకు సంబంధించి తగిన ప్రతిపాదనలు నాలుగు రోజుల్లోగా విజయవాడ కమిషనర్ కార్యాలయానికి పంపించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకోసం సంబంధిత గ్రామాల కాంపిటెంట్ అథారిటీలో తగిన సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని, ఉదయం 6-8 గంటల వరకు అందుబాటులో ఉండి పెండింగ్‌లు క్లియర్ చేస్తారు. రైతులు సంబంధిత కార్యాలయాల్లో తగిన ఆధారాలు అందజేయాలని సూచించారు.

మండుతున్న కూరగాయల ధరలు

- ధరలపై వేసవి ప్రభావం
- ఖరీఫ్ పంటలు వస్తేనే ఉపశమనం అంటున్న వ్యాపారులు



కూరగాయలు

వేటపాలెం: మండే వేసవి పోయిందిలే అని హమ్మయ్యా.. అనుకునేలోపే మరో మంట తినే కూరగాయల రూపంలో వచ్చి చేరింది. వేసవి ఎండల ప్రభావం దృష్ట్యా పంటలు లేక పోవడంతో కూరగాయలు, ఆకుకూరల ధరలు ఆకాశాన్ని దాటాయి. సరైన వాతావరణ అనుకూల పరిస్థితి ఉన్నప్పుడే పంట దిగుబడులు సక్రమంగా ఉంటాయి. కూరగాయల దిగుబడులు లేకపోవడంతో దాని ప్రభావం మార్కెట్‌పై పడింది. దీంతో ప్రజలు కొనాలంటేనే భయపడుతున్నారు. ప్రస్తుతం కొన్ని రకాల కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి తీసు కొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. దీనితో కొన్ని రకాల కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. తొలకరి వర్షాలు ప్రారంభం కావడంతో తిరిగి రైతులు ఖరీఫ్‌లో సాగు మొదలుపెట్టారు. ఈ పంటలు దిగుబడులు రావాలంటే రెండు నెలల వ్యవధి పడుతుంది. అప్పటివరకు కూరగాయల ధరలు తగ్గే పరిస్థితి లేదంటున్నారు. అయితే ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు కూరగాయల ధరలు కొంత పెరుగుతుంటాయని వ్యాపారులు చెబుతున్నారు. పంట దిగుబడులు తగ్గడమే దీనికి ప్రధాన కారణం అంటున్నారు. తిరిగి ఆగస్టు నాటికి ధరలు తగ్గుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు..

కూరగాయలు	కిలో రూ.
పచ్చిమిర్చి	130
బీరకాయలు	100
కాకరకాయలు	100
టమోటా	100
క్యారెట్	90
వంకాయలు	80
బెండకాయలు	80
ఆలుగడ్డలు	70
బీట్‌రూట్	70
చేమ దుంపలు	60
క్యాబేజీ	60
క్యాలిఫ్లవర్ (ఒకటి)	60
దోసకాయలు	60
పచ్చి అరటికాయలు (డజను)	60